క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు కోరారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరంలో కార్డియాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో, న్యూరో, ఆర్థోపెడిక్ తదితర వైద్య నిపుణులు పాల్గొని, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారని వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని పోలరాజు తెలిపారు.

పొట్టిలంకలో..

పొట్టిలంక సబ్ సెంటర్ వద్ద వేద స్పైన్ సెంటర్ వైద్యులు తేజో ఫణీంద్ర ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎస్సీ ప్రాంత అభివృద్ధికి కృషి



చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న బండి నాగేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో ఎస్సీ పేట అభివృద్ధికి కృషి చేస్తామని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఎస్సీ పేటకు చెందిన విద్యుత్ ఉద్యోగి బండి నాగేశ్వరరావు ఆధ్వర్యాన సుమారు 50 మంది యువత, మహిళలు నాగేశ్వర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ పేటలో అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ఆ ప్రాంతంలో ఏ సమస్య వచ్చినా బండి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని చందన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ధవళేశ్వరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన భక్తులకు మంగళవారం అన్నదానం చేశారు. ట్రస్ట్ ఫౌండర్ దొమ్మేటి వీర వెంకట సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ దొమ్మేటి రవికుమార్, ఆలయ చైర్మన్ బర్రి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ

సీటీఆర్ఐ: శ్యామలా నగర్ స్టేట్ బ్యాంక్ కాలనీలోని శ్రీ లలితా మండలికి చెందిన మహిళా భక్తులు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ నిర్వహించారు. వరుసగా నాలుగో మంగళవారం కూడా ఈ పారాయణ నిర్వహించామని మండలి అధ్యక్షురాలు చర్ల రాజేశ్వరి చెప్పారు. పండగ రోజుల్లో మహిళలు కలసిమెలసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పారాయణ అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సీత, లక్ష్మి, కామేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బ్యుటీషియన్, టైలరింగ్ శిక్షణ ప్రారంభం



బ్యుటీషియన్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థినులు బ్యుటీషియన్, ఎంబ్రాయిడరీ టైలరింగ్ తరగతులు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 60 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ వలన విద్యార్థినుల్లో వృత్తిపరమైన నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు. కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి మాట్లాడుతూ, పిల్లలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, అలుమ్నీ కార్యదర్శి పీఎస్‌సీహెచ్‌పీ దీపికారాణి, ట్రెజరర్ వీబీటీ సుందరి, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు అరెస్టు, రిమాండు నేపథ్యంలో కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్‌లో టీడీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నేతలు మంగళవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్పతో పాటు నాయకులు కేఎస్ జవహర్, జ్యోతుల నెహ్రూ, గొల్లపల్లి సూర్యారావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, చంద్రబాబుపై కేసులు, ఆయన పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేయాలని అన్నారు.

బ్లేడ్‌బ్యాచ్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

- గంజాయి, సారాపై కూడా దృష్టి పెట్టాలి
- జిల్లా నేర సమీక్షలో పోలీసులకు ఎస్పీ జగదీష్ ఆదేశం



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రౌడీ షీటర్లు, బ్లేడ్‌బ్యాచ్, పాత నేరస్తులతో పాటు గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. తొలుత జిల్లా సమగ్ర స్వరూపం, స్థితిగతులు, రాజకీయ, భౌతిక పరిస్థితులు, నేరాలపై ఎస్పీకి పోలీసు అధికారులు సమగ్రంగా వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్ ట్రయల్, విచారణలో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీలైన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను పరిశీలించి, వాటి సంఖ్యను తగ్గించాలని సూచించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్ల ప్రకారం కేసుల విచారణ సక్రమంగా చేసి చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. నైట్ రౌండ్ల అధికారులందరూ విధిగా సమన్వయంతో పని చేస్తూ, నేరాలు జరగకుండా చూడాలని జగదీష్ సూచించారు. నైట్ బీట్లు పెంచాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు తమ స్టేషన్ పరిధిలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి, రహదారి భద్రత, ప్రమాదాలు, సైబర్ క్రైం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించాలన్నారు. శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని, మహిళలు, పిల్లలు, వృద్ధుల కేసుల విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్పీలు ఎం.రజని, జి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ డి.రాఘవ కూడా పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ

స్థానిక ట్రాఫిక్ స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ తనిఖీ చేశారు. రికార్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించేవారి కౌన్సెలింగ్ సెంటర్, ఈ–చలానా ఆఫీస్, ట్రాఫిక్ సిటీ, హైవే బీట్లు, జిల్లా ట్రాఫిక్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపే వారిపై, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అటువంటి వాహనదారులను, వారి తల్లిదండ్రులను, వారికి వాహనాలు ఇచ్చే యజమానులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కారంపై ట్రాఫిక్ డీఎస్పీకి సూచనలు చేశారు. పెండింగ్ ఈ–చలానాలను నిర్ణీత సమయంలోగా కట్టించాలని, రెండు అంతకన్నా ఎక్కువ చలానాలున్న వాహనాలను గుర్తించి, సీజ్ చేయాలని ఆదేశించారు. చలానాలు కట్టిన తర్వాతే ఆ వాహనాలను విడుదల చేయాలని స్పష్టం చేశారు. సిబ్బంది క్రమశిక్షణతో పని చేస్తూ, జిల్లాలో ట్రాఫిక్ అంతరాయాలను నివారించాలని, ప్రజలకు సహకరించేలా విధులు నిర్వహించాలని ఎస్పీ జగదీష్ సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



బొమ్మూరు సమావేశంలో మాట్లాడుతున్న బోస్. చిత్రంలో చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బీసీల సంక్షేమానికి, అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బొమ్మూరు జీపీఆర్ రోడ్డులోని ఫంక్షన్ హాలులో రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన గ్రామ బీసీ నాయకులతో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, త్వరలో రూరల్ నియోజకవర్గంలో నిర్వహించే బీసీ మహాసభను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ గెలుపులో బీసీల పాత్ర ఎంతో ఉందని స్వయంగా సీఎం జగనే ఎన్నోసార్లు చెప్పారని అన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు, నామినేటెడ్, మంత్రి పదవుల్లో సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. బీసీలందరూ ఏకతాటి పైకి వచ్చి, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు.

బీసీ మహాసభను జయప్రదం చేయాలి

కడియం: త్వరలో రూరల్‌లో నిర్వహించనున్న బీసీ మహాసభను జయప్రదం చేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. కడియంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) ఇంటి వద్ద పార్టీ నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఆయనకు ఆర్యాపురం అర్బన్ బ్యాంకు చైర్‌పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి, స్థానిక నాయకులు గిరజాల నాగేశ్వరరావు, పాలిక శ్రీను, దాసరి శేషగిరి, బండారు శ్రీనివాస్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంత దామిరెడ్డిపల్లిలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ముద్రగడ నాగమణి ఇంటి వద్ద గ్రామంలోని పలువురు నాయకులను బోస్ కలుసుకున్నారు.

కార్యకర్త మృతదేహానికి ఎంపీ నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సకాలంలో జరగక స్థానిక సీటీఆర్ఐ సుబ్బారావు నగర్‌కు చెందిన కార్పెంటర్, వైఎస్సార్ సీపీ కార్యకర్త ఏలూరు రామస్వామి(40) మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామస్వామి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు ఉన్నారు.

నిస్వార్థ సేవతోనే గుర్తింపు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- గౌతమీ జీవకారుణ్య సంఘం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



ఎంపీలు భరత్, బోస్‌లను సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు తదితరులు

ప్రకాశం నగర్: ఎటువంటి పదవి అయినా నిస్వార్థ సేవతోనే గుర్తింపు వస్తుందని, ఈ విషయం మరచిపోరాదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గౌతమీ జీవకారుణ్య సంఘం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం మంగళవారం రాత్రి జరిగింది. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులు, అనాథలు, వృద్ధుల సంక్షేమం కోసం గౌతమీ జీవకారుణ్య సంఘాన్ని 1940లో కారుణ్యానంద స్వామీజీ స్థాపించారని గుర్తు చేశారు. అప్పటి నుంచీ ఎంతోమంది అభాగ్యులను ఈ సంఘం అక్కున జేర్చుకుని కన్నతల్లిలా సేవలందిస్తోందని అన్నారు. సమాజ సేవకుడు బర్రే కొండబాబు చైర్మన్‌గా నియమించిన నూతన పాలకవర్గం ఈ సంఘం కీర్తిప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నగర రూపురేఖలు సమూలంగా మార్చామని చెప్పారు. అనంతరం నూతన పాలక మండలి ఆధ్వర్యాన ఎంపీలు భరత్‌రామ్, బోస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

- విస్తృత ప్రచారం చేయాలి
- రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నిర్మలా గ్లోరీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నిర్మలా గ్లోరీ

రాజమహేంద్రవరం రూరల్: ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నిర్మలా గ్లోరీ అన్నారు. ఈ కార్యక్రమం ముందస్తు కార్యాచరణపై బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం అమలుపై రూపొందించిన ముందస్తు షెడ్యూలు ప్రకారం సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు సర్వేకు హాజరు కావాలని అన్నారు. ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన ప్రజల ఆరోగ్య వివరాలను ఆరోగ్య కార్యకర్తలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో విభాగాల వారీగా ఓపీ నిర్వహిస్తారని, వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ప్రభుత్వాసుపత్రి ద్వారా ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యం అందించేందుకు ఈ క్యాంపులు ఎంతో దోహదపడతాయని గ్లోరీ అన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రచారం ఈ నెల 15న ప్రారంభం కానుందన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లను సందర్శించి, ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారన్నారు. వారి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఏఎన్ఎం, సీహెచ్‌సీ వైద్యాధికారులు సందర్శించే తేదీలను వారికి తెలియజేస్తారని చెప్పారు. ఈ నెల 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో అవసరమైన వారికి వివిధ వైద్య పరీక్షలు, వైద్య సహాయం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వివరించారు. అవసరమైతే రిఫరల్ ఆస్పత్రికి పంపి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి సచివాలయంలోనూ డెంగీ, మలేరియా పరీక్షలకు అవసరమైన కిట్లు ఉంచామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో 10 మంది వరకూ కంటి నిపుణులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారులు, జిల్లా మలేరియా అధికారి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ కేంద్రం తనిఖీ



వర్మి కంపోస్ట్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు: స్థానిక లూథర్‌గిరి సమీపాన ఉన్న మున్సిపల్ రీసైక్లింగ్ కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ గంధం సునీత మంగళవారం తనిఖీ చేశారు. అలాగే క్వారీ మార్కెట్ సమీపాన వర్మి కంపోస్ట్ కేంద్రాన్ని కూడా ఆమె సందర్శించారు. విండ్రో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్, సేంద్రియ పద్ధతిలో ఎరువుల తయారీ, గృహ వ్యర్థాలు, హానికర వ్యర్థాల ప్రాసెసింగ్‌లో అనుసరిస్తున్న పద్ధతులు, పరికరాల పనితీరును పరిశీలించారు. వివిధ రకాల వ్యర్థాలను సేకరించడం, వాటిని వేరు చేయడం, రీసైక్లింగ్‌లో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వ్యర్థాలను వేర్వేరుగా ఇవ్వడం వల్ల వారి పని సులభమవడంతో పాటు మరింత మెరుగ్గా రీసైక్లింగ్ చేసే అవకాశం ఉంటుందని న్యాయమూర్తికి నగర పాలక సంస్థ అధికారులు వివరించారు. రీసైక్లింగ్ కేంద్రాల్లోని కార్మికులతో సునీత మాట్లాడి, వారి సేవలను అభినందించారు. అందరూ కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. వారికి ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న, ఈఈ షేక్ మదార్ అలీ, ఐఈసీ స్పెషలిస్ట్ అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

లాలాచెరువు హెచ్‌బీ కాలనీ అభివృద్ధికి కృషి



అంబేడ్కర్ ఎరీనా పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. చిత్రంలో కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీలో గడచిన మూడున్నర దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని నాలుగున్నరేళ్లలో చేసి చూపించామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఈ కాలనీలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ ఎరీనా పార్కుకు కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో రూ.2 కోట్లతో ఆర్ఆర్ఆర్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రాజా చెప్పారు. అలాగే స్పిన్నింగ్ మిల్లు కాలనీలో మరో రూ.3 కోట్లతో చిల్డ్రన్స్ పార్కు, కాలనీ వెలుపల ఖాళీ స్థలంలో రూ.కోటితో బటర్‌ఫ్లై థీమ్ పార్క్ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రోడ్లు, డ్రైన్లు, పార్కులు, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు బాధ్యత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవాల సతీష్ పాల్గొన్నారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. విద్యుత్ కాలనీకి చెందిన ఆచంట వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి యథావిధిగా ఇంట్లో పడుకున్నాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి వెనుకవైపు తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలోని ఏడు గ్రాముల బంగారు నగలు, 30 గ్రాముల వెండి వస్తువులను దొంగలు అపహరించారని గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భవిత సేవలు భేష్



భవిత కేంద్రంలో చిన్నారులతో రామ్‌కమల్

ధవళేశ్వరం: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు విద్యా బోధన అందిస్తున్న భవిత కేంద్రం సేవలు ఎంతో బాగున్నాయని రాష్ట్ర సలహాదారు ఎం.రామ్‌కమల్ అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు డిజిటల్ విధానంలో కూడా బోధన అందించాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు చదువు పట్ల ఆకర్షితులయ్యేందుకు డిజిటల్ విధానం దోహదపడుతుందని చెప్పారు. ఇక్కడి సిబ్బంది నిబద్ధతతో సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. భవిత కేంద్రానికి తీసుకువచ్చిన తరువాత చిన్నారుల్లో వచ్చిన మార్పులు అడిగి తెలుసుకున్నారు. ధవళేశ్వరం భవిత కేంద్రానికి అవసరమైన వనరులను సమకూరుస్తామని రామ్‌కమల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, ఐఈ కో ఆర్డినేటర్ కనకబాబు, ఐఈఆర్‌పీ వి.విశ్వపతి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ నిర్వాహకుడు డాక్టర్ గోలి వెంకట రామారావు ఆధ్వర్యాన శ్రీ సత్యసాయి గురుకులంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. పాఠశాలలోని వెయ్యి మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య తెలిపారు. ఎవరికైన వైద్యపరమైన అవసరాలుంటే వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో ఈఎన్‌టీ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దంత వైద్య నిపుణులు అమర్నాథ్, హరిప్రియ, చర్మ వైద్య నిపుణులు ప్రవీణ్, వెంకటేష్ సేవలు అందించారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల వైద్య విభాగానికి చెందిన యోగేశ్వరరావు ఆధ్వర్యంలోని బృందం, ఉపాధ్యాయినులు సేవలు అందించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన మండల స్థాయి వాలీబాల్ జట్టు

రాజమహేంద్రవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కొంతమూరులోని జూబిలీ మెమోరియల్ ఆర్‌సీఎం హైస్కూల్‌లో బాలుర అండర్–14, 17 క్రీడా పోటీలు, ఎంపికలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను ఎంఈఓలు తులసీదాస్, చందుకుమార్ ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఇబ్రహీం తెలిపారు.